తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 28 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

## రైతులకు సాగునీటిపై మాట్లాడితే..

# కాంగ్రెస్ నాయకుల చిల్లర మాటలెందుకు..?

## మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య



- ❖ ఉద్యమ నాయకులపై మాట్లాడే అర్హత పూటకో పార్టీ మారేవారికి లేదు
- ❖ రేవంత్‌రెడ్డి ఎత్తిపోయకనే కుప్పం వరకు నీళ్లు పోతున్నాయి
- ❖ కాలం తెచ్చిన కరువు కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువే
- ❖ గోదావరిలో పోతున్న నీళ్లను ఇప్పటికైనా ఎత్తిపోయాలి

ప్రజావారధి/మోత్కూరు

గోదావరి, కృష్ణాలో వందల టీఎంసీల నీళ్లు పారుతున్నా ఆ జలాలను ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదని, తెలంగాణ రిజర్వాయర్లను ఎందుకు నింపడం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే రైతులపై ఏమాత్రం సోయి లేని కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరువొచ్చే ప్రమాదముందని కొన్ని నెలలుగా శాస్త్రవేత్తలు, మేధావులు హెచ్చరిస్తున్నారని, గోదావరి, కృష్ణా నగదుల్లో మూడు, నాలుగు నెలలుగా వందల టీఎంసీల నీళ్లు ఏపీకి తరలిపోతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఆ నీళ్లను ఒడిసి పట్టి ఎత్తిపోయకుండా మొద్దు నిద్ర పోయారన్నారు. మేడిగడ్డ పోయి చూసినా, శ్రీశైలం పోయి చూసినా నీళ్లు ఏపీకి ఎలా పోతున్నాయన్నది తెలుస్తుందన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు ఎత్తిపోస్తే కేసీఆర్‌కు పేరొస్తుందన్న అక్కసుతో సీఎం రేవంత్ రెడ్డి నీళ్లు ఎత్తిపోయకుండా తెలంగాణ రైతాంగాన్ని, ప్రజలను కరువు కోరల్లోకి నెట్టారన్నారు. కాలం తెచ్చిన కరువు అసలే కాదని..ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువేనన్నారు. కరువు కాలంలో రాజకీయం చేయకుండా నీళ్లు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరితే ఫోటోలకు ఫోజుల కోసమే బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు చిల్లర మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఉద్యమ నాయకులకు ఫోటోలకు ఫోజులు ఇవ్వాల్సిన అవసరం లేదని, మా నాయకులు నిజాలు మాట్లాడితే వాటికి సమాధానం చెప్పే దమ్ము లేక చిల్లర మాటలెందుకన్నారు. ఇప్పటికీ మేడిగడ్డ నుంచి, శ్రీశైలం నుంచి ఏపీకి నీళ్లు పోతున్నాయో లేదా వాస్తవాలను ప్రజలను చూపించడానికి జర్నలిస్టులతో అక్కడకు వెళదామని, వాస్తవాలేంటో జర్నలిస్టులే ప్రజలకు చెబుతారని, దమ్ముంటే సిద్ధమా అని సవాల్ చేశారు. పదవుల కోసం పూటకో పార్టీ మారే వారికి ఉద్యమ నాయకులపై మాట్లాడే నైతిక అర్హత లేదని, తిన్నింటి వాసాలు లెక్క పెట్టేవారు కూడా నీతులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టి నిండా ముంచారని, చివరకు రైతు పంట వేయాలంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిన పరిస్థితికి తీసుకవచ్చారని విమర్శించారు. మూడేళ్ల పాలనలో చేసిందేమీ లేకపోవడంతో ప్రజలు ఛీకొడుతున్నారని, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నాయకులపై చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు, ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని, మళ్లీ కేసీఆరే రావాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
బుధవారం
జనరల్ న్యూస్
28 - 10 - 2026


# పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్



ప్రజావారధి/మోత్కూరు

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ కోరారు. మోత్కూరు మండలం పనకబండ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఫాం-18 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడానికి వచ్చే నెల 6 చివరి తేది అని తెలిపారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలా చైతన్యం చేస్తున్నామన్నారు. గ్రామాలతో పాటు మోత్కూరు మున్సిపాలిటీలో అర్హులైన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ పక్షాన గళం వినిపించే నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోరైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పానుగుల్ల విష్ణుమూర్తి, గ్రామశాఖ అధ్యక్షుడు లోతుకుంట స్వామి, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్, లోతుకుంట అనిల్ కుమార్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ బత్తిని మహేష్, బత్తిని మల్లేష్, పైళ్ల బుచ్చయ్య, పొన్నెబోయిన మత్స్యగిరి, పొన్నెబోయిన పాండురంగడు, బత్తిని రామలింగయ్య, బత్తిని అంజయ్య, ఓర్సు ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.